శిథిలావస్థలో పశువైద్యశాలలు

- భయాందోళనలో పశువైద్యులు
- వేధిస్తున్న మందుల కొరత
- ఇబ్బందులలో పశు పోషకులు



సింహాద్రిపురంలో శిథిలావస్థకు చేరుకున్న పశువైద్యశాల

సింహాద్రిపురం : మండలంలోని పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆ పశువైద్యశాలలో పశువైద్యులు విధులు నిర్వర్తించాలంటే జంకుతున్నారు. మూగ జీవాలకు పశువైద్య సేవలు సక్రమంగా అందకపోగా మందుల కొరత వేధిస్తోంది. దీంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వైద్యసేవలు అందించాల్సి ఉంది. అయితే జూనియర్ వెటర్నరీ పశువైద్యులతో సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే గత 7 నెలల నుంచి మందుల కొరత వేధిస్తోంది. మండల వ్యాప్తంగా 10521 ఆవులు, ఎద్దులు, 24వేల మేకలు, గొర్రెలు ఉండగా, సింహాద్రిపురం, అంకాలమ్మగూడూరు, బిదినంచర్ల, బలపనూరు, సుంకేసుల, కోవరంగుంటపల్లె గ్రామాల్లో ఉన్న పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పశువైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ పశువైద్యశాలల్లో డాక్టర్లు కూర్చోవడానికి వసతులు కూడా సరిగా లేవు. పశువైద్యశాలల్లో భవనాల శ్లాబ్ దెబ్బతిని ఇనుప కడ్డీలు కనిపిస్తూ ఎప్పుడు కూలుతాయోనన్న విధంగా ఉన్నాయి. వర్షం వస్తే భవనాలు ఉరుస్తుండటంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడంలేదు. పశువైద్య



శ్లాబ్ దెబ్బతిని కడ్డీలు కనిపిస్తున్న పశువైద్యశాల భవనం

శాలల్లో పశువైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పశు పోషకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేధిస్తున్న మందుల కొరత

పశువైద్యశాలల భవనాలు అధ్వానంగా ఉండటంతోపాటు వసతుల లేమి స్పష్టంగా కనిపిస్తోంది. మందుల కొరత వేధిస్తోంది. దీంతో మూగజీవాలకు సరైన వైద్య సేవలు అందడంలేదని పశు పోషకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువైద్యశాలలకు నూతన భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే పశువైద్యశాలల్లో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

మందులు బయటకు రాస్తున్నారు



పశువులకు వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు మందులు ఇవ్వడం లేదు. ప్రభుత్వం పశువైద్యశాలలో మందులు లేవని చెబుతున్నారు. ప్రైవేటుగా కొని తెచ్చుకోవాలని డాక్టర్ చీటీలురాసి ఇస్తున్నారు. తప్పని పరిస్థితులో మందులను కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– గంగాధరరెడ్డి, పాడి రైతు, సింహాద్రిపురం

పశువైద్యులు అందుబాటులో ఉండాలి



పశువైద్యశాలల్లో పశువైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పశు పోషకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యశాలల్లో భవనాల శ్లాబ్ దెబ్బతిని ఇనుప కడ్డీలు కనిపిస్తూ ఎప్పుడు కూలుతాయోనన్న విధంగా ఉన్నాయి. వర్షం వస్తే భవనాలు ఉరుస్తుండటంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడంలేదు.

– మధుసూదన్, పాడి రైతు, సింహాద్రిపురం

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న పోలీస్ సిబ్బంది

ఎర్రగుంట్ల : స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌ను జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో సమావేశమై కేసులకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. సిబ్బందికి తగు సూచనలు అందించారు. పట్టణ సీఐ నరేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం



విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న శోభ

జమ్మలమడుగు : ఎయిడ్స్ వ్యాధిలేని సమాజం కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఎయిడ్స్ కో ఆర్డినేటర్ శోభ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిపట్ల మానవతా దృక్పధంతో ఉండాలన్నారు. హెచ్‌ఐవీ సోకిన వారికి ప్రభుత్వం ఏఆర్‌టీ మందులను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. హెచ్‌ఐవీపై సందేహాలు ఉంటే 1097 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవచ్చు అని సూచించారు. హెచ్‌ఐవీపై యువతీ యువకులు తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు.

పన్నుల వసూళ్లుపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషఫణి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని నీటి, ఇంటి పన్నులు సేకరణ, నీటి చార్జీలు, శానిటేషన్ మెరుగుదల, అనధికార నిర్మాణాలను గుర్తించడం, వంటి అంశాలపై చర్చించారు. చెల్లింపులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకారించాలని ఆయన ప్రజలను కోరారు.

గుణకణపల్లెలో రెవెన్యూ సదస్సు



రైతుల సమస్యలు వింటున్న తహసీల్దార్ ఈశ్వరయ్య

లింగాల : మండలంలోని గుణకణపల్లెలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఈశ్వరయ్య పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు వేదికగా నిలిచాయన్నారు. భూ సమస్యలతోపాటు పట్టాదారు పాసుపుస్తకంలో దొర్లిన తప్పులను సవరించుకోవడానికి రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ నరేంద్ర, ఆర్ఐ గంగాధరరెడ్డి, సర్వేయర్ పార్వతి, రైతులు పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలతో పాడి పశువుల అభివృద్ధి



పశువులకు పరీక్షలను నిర్వహిస్తున్న పశు గణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు రమేష్

వల్లూరు : పాడి పశువుల అభివృద్ధికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు రమేష్ తెలిపారు. మండల పరిధిలోని తప్పెట్ల గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 20 పాడి పశువులకు గర్భ కోశ వ్యాధులకు చిక్సిలను అందించారు. 10 పశువులకు చూడి పరీక్షలను నిర్వహించారు. 4 పశువులకు ఎద సూదులను వేశారు. 68 దూడలకు నట్టల నివారణ మందులు తాపారు. 222 పశువులకు సాధారణ చికిత్సలను అందించారు. కార్యక్రమంలో కమలాపురం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉత్తయ్య, పశు వైద్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

లింగాల : గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం లింగాల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సర్పంచ్‌లకు, పంచాయతీ రాజ్ సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించారు. మొదటి రోజు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపాలు ఉన్న వెంటనే వాటిని నివారించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలిపి ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బాల్య వివాహాల నివారణకు, బాల కార్మికుల నిరోధానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రమేష్, ఎంపీడీఓ కార్యాలయ అధికారి ఫ్లోరెన్స్, పీఆర్ ఏఈ శ్రీనివాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు కలసి కట్టుగా కృషి చేసి గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సర్పంచులు, అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సమష్టి కృషితో సుస్థిరాభివృద్ధి సాధించాలన్నారు. స్థానిక వనరులను వినియోగించుకుని ప్రణాళికా బద్ధంగా పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధుల నుంచి ప్రతి పైసా గ్రామాల అభివృద్ధికే కృషి చేయాలన్నారు. అనంతరం మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ కెజియా, వెలుగు ఏపీఎం గంగాధర్‌లు అభివృద్ధి సాధించే 9 అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నిలకు సర్వం సిద్ధం



చిన్నదండ్లూరులోని ఎన్నికల బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శోభన్‌బాబు

ఎర్రగుంట్ల : నీటి సంఘం ఎన్నికలను ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నామని అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని తహసీల్దార్ శోభన్ బాబు తెలిపారు. గురువారం అయిన నీటి సంఘం ఎన్నికల కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. మండలంలో చిన్నదండ్లూరు, ఇల్లూరు, పోట్లదుర్తి, హనుమనుగుత్తి గ్రామాల పరిధిలో నీటి సంఘాలు ఉన్నాయన్నారు. వీటిలో ఒక్కొక్క నీటి సంఘం పరిధిలో ఉన్న ఓటర్లు 12 మంది ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులను ఎన్నుకుంటారన్నారు. ఇలా నాలుగు నీటి సంఘాలకు గాను 48 మంది ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు ఎన్నుకోబడుతారన్నారు. ఈ సభ్యులలో అధ్యక్షుడిని, ఉపాధ్యాక్షుడిని ఎన్నుకుంటారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సమష్టి కృషితోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : అధికారుల సమష్టి కృషితోనే గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామం సుభిక్షంగా, పరిశుభ్రంగా ఉండాలన్నదే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ శిక్షణలో పేదరిక నిర్మూలనలో భాగంగా మెరుగైన జీవనోపాధులను కల్పించడం, ప్రజల ఆరోగ్యం, సురక్షితమైన నీటిని అందించడం ఇందులో భాగమేనన్నారు. స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలను కల్పించడం, సామాజిక భద్రత తదితర తొమ్మిది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. శిక్షణ పొందిన అధికారులు తమ పరిధిలోని గ్రామ పంచాయతీలు సుస్థిర లక్ష్యాలు సాధించేందుకు చర్యలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కులాయి కనెక్షన్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలి



అక్రమ కులాయి కనెక్షన్లను పరిశీలిస్తున్న కమిషనర్

జమ్మలమడుగు : పట్టణంలో అక్రమ కులాయి కనెక్షన్లు ఉన్నవారు వాటిని డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని సంజామలమోటు, ఎంపీడీఓ కార్యాలయ ప్రాంతాల్లో అక్రమ కులాయి కనెక్షన్లపై ఆరాతీసి వాటిని తొలగించే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. అనంతరం ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులు ఆ స్థలాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. లేకుంటే జరిమానాలు వేస్తామన్నారు. ప్రజలు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు.

రైతు సమస్యలపై గళం విప్పుదాం

వల్లూరు (చెన్నూరు) : రైతు సమస్యలపై వైఎస్సార్ సీపీ చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెన్నూరు వైఎస్సార్ సీపీ కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం రైతు సమస్యలపై చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీకి వెన్నుముక లాంటి ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్యకర్తలు అందరూ కలిసి రైతు సమస్యలపై జరిగే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఉదయం 9 గంటలకల్లా కడపలోని పార్టీ కార్యాలయానికి చేరుకుని ర్యాలీగా కలెక్టరేట్ వెళ్లాల్సి ఉంటుందన్నారు.

సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఘనవిజయం



విజయోత్సాహంలో ఎస్‌సీఆర్ ఎంప్లాయిస్ సంఘ్

ముద్దనూరు : ఈనెల 4, 5, 6 తేదీల్లో జరిగిన గుంతకల్లు డివిజన్ పరిధిలోని కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ (ఎస్‌సీఆర్‌ఈ)సంఘ్ ఘన విజయం సాధించింది. గురువారం సాయంత్రం గుంతకల్లులో వెలుబడిన ఎన్నికల ఫలితాల్లో ఎస్‌సీఆర్ మజ్దూర్ యూనియన్‌పై ఎస్‌సీఈఆర్ సంఘ్ 243 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ఆ సంఘం కడప బ్రాంచి చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన సంఘ్ కాలపరిమితి 5 సంవత్సరాలని ఆయన తెలిపారు. ఈ విజయంలో కీలకపాత్ర పోషించిన రైల్వే కార్మికులకు చైర్మన్ చంద్రశేఖర్, కార్యదర్శి ఈశ్వరయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

16 నుంచి ధనుర్మాసోత్సవ పూజలు



పులివెందులలోని శ్రీకృష్ణ ఆలయం

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురం రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో ఈనెల 16వ తేదీన జనవరి 13వ తేదీ వరకు ద్వితీయ ధనుర్మాసోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ధనుర్మాసోత్సవం సందర్భంగా ఆయా తేదీలలో ప్రతి రోజు ఉదయం గోత్రనామాలతో సంకల్పం, గోదా రంగునాథుల పూజా కార్యక్రమం, తిరుప్పావై, ప్రసాద నివేదన, హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. కావున భక్తులు ప్రతిరోజు జరిగే పూజా కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు.

22 నుంచి భగవద్గీత తరగతులు :

పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి ప్రతి ఆదివారం భగవద్గీత తరగతులు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ వై.నాగేంద్రమ్మ భగవద్గీత శ్లోకాలు, పారాయణం, నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని చిన్నపిల్లల నుండి పెద్దల వరకు సద్వినియోగం చేసుకుని భగవద్గీత చదవడం నేర్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959536008 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

వల్లూరు (చెన్నూరు) : ప్రణాళికబద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని డీపీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. చెన్నూరులో గురువారం అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలలో అభివృద్ధి ఎంత ముఖ్యమో కూడా ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ఈ రెండిటికి మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ఎలాంటి వసతులు కల్పించాలి, గ్రామాల జీవనశైలి ఇతర విషయాలపై దృష్టి సారించాలన్నారు. ఆయా గ్రామాలలో ఆదాయ వనరులు అభివృద్ధి వసతులు అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు ఈవోపీఆర్డీ సురేష్‌బాబు, ఏపీవో శైలజ, ఏపీఎం వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ గురమ్మ, ఏఈలు మల్లికార్జున, ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో నాలుగు అర్జీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి సంబంధించిన భూమి సమస్యలపై నరసరామయ్యగారిపల్లె అంగన్‌వాడీ పాఠశాలలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి నాలుగు అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. శుక్రవారం విశ్వనాధపురం గ్రామానికి సంబంధించిన భూమి సమస్యలపై విశ్వనాధపురం వార్డు సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు.

నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వీరపునాయునిపల్లె : అన్నదాతకు అండగా జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. రైతు సోదరులు, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలు, పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీవాణి

వల్లూరు : భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ శ్రీవాణి తెలిపారు. మండల పరిధిలోని కోదండ రామాపురం రెవెన్యూ గ్రామానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం గురువారం కొప్పోలులో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఇందులో ప్రజల నుండి 3 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి ప్రజల సమన్వయంతోనే సాధ్యం



సుస్థిర అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి అన్ని వర్గాల ప్రజల సమన్వయంతోనే సాధ్యమవుతుందని మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ సభాభవనంలో మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళి ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిపై అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా ఆ కార్యక్రమం విజయవంతం కావాలంటే ఆ గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలన్నారు. గ్రామ స్థాయిలోని అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఒక పట్టుదలతో చేయాలని అటువంటప్పుడే లక్షాలను సాధించేందుకు వీలుంటుందన్నారు. నాలుగు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు మొదటి విడతలో గురువారం, శుక్రవారం, రెండవ విడతలో మంగళవారం, బుధవారం నిర్వహిస్తామన్నారు. అనంతరం ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి సాధించాల్సిన లక్ష్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, మండల విద్యాశాఖాధికారి జాఫర్‌సాధిక్, వెలుగు ఏపీఎం బాగ్యమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్ష్మినారాయణ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు.

ఎంపీకి సమస్యలపై వినతుల వెల్లువ



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సమస్యలపై ప్రజలు వినుతులను అందజేశారు. ఆయన ప్రజల నుంచి వచ్చిన సమస్యల వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి చొరవ చూపారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించాలన్నారు. ఆరునెలల కాలంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. అలాగే ఈనెల 15వ తేదీన ఆదివారం కడపలో నిర్వహించే బహిరంగ సభకు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని జమియత్ ఉలుమా ఏ హింద్ జిల్లా అధ్యక్షుడు హమీద్ హుస్సేన్ ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు నూరుల్లా, వైఎస్సార్‌సీపీ నూర్‌బాష సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఓతూర్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీఓ తిమ్మక్క

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మండలంలోని గ్రామాల్లో అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రుపొందించాలని డీఎల్పీఓ తిమ్మక్క తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులకు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఏపీఎం, ఏపీఓ మండల ఇంజనీరింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిపించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : ఈనెల 14వ తేదీన జరిగే నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పుట్టినరోజు వేడుకలను కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ మైలవరం నీటి ఆయకట్టు రైతులు, చెరువు ఆయకట్టు రైతులకు నీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అయితే అధికారులు మాత్రం నోడ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వడంలేదన్నారు. దీనిని అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, నాయకులను నీటి సంఘాల ఎన్నికల్లో పాల్గొనకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో పోలీసులు నీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్న సమయంలో ప్రత్యేక భద్రతను కల్పించాలన్నారు. రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నో హామీలు ఇచ్చి అసెంబ్లీ సమావేశాల్లో సూపర్ సిక్స్ హామీలు చూస్తుంటే భయం వేస్తుందంటూ వాటిని అమలు అసాధ్యం అంటూ చేతులు ఎత్తేసి ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో మైలవరం, జమ్మలమడుగు, పెద్దముడియం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



పెద్దరంగాపురంలో నిల్వ ఉన్న మురుగునీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

పులివెందుల టౌన్/రూరల్ : గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ నజీర్‌అహ్మద్ తెలిపారు. గురువారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం, మండలంలోని రచ్చుమర్రిపల్లె గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను సదస్సుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే గ్రామాల్లోని వీధులలో ఉన్న చెత్తా చెదారాలు, రోడ్లపై ఉన్న మురుగునీటి సమస్యలను ఆయనకు విన్నవించారు. రైతులు వివిధ సమస్యలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి

కమలాపురం : ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే సేవాభావం కలిగి ఉండాలని మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు వల్లెల సునీల్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పుట్లంపల్లె యానాదీ కాలనీలో సునీల్‌రెడ్డి తన మిత్రుడు ఎస్ఆర్ఐ కోడూరు రాజేంద్రారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాలనీ వాసులకు అన్నదానం ఏర్పాటు చేశారు.